క్లుప్తంగా

సర్పంచులకు సన్మానం



సర్పంచులను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కందుకూరు: మండల పరిధిలోని కందుకూరు, దెబ్బడగూడ సర్పంచ్‌లు ఎస్.శమంతకమణి, ఏనుగు శ్రావణిలను గురువారం కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఎస్.కృష్ణనాయక్, అందుగుల సత్యనారాయణ ఆధ్వర్యంలో సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జైపాల్‌రెడ్డి, రాజేష్, అమరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలకు సౌండ్ సిస్టమ్ వితరణ



సౌండ్ సిస్టమ్‌ను అందిస్తున్న సర్పంచ్

కందుకూరు: మండల పరిధిలోని తిమ్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గురువారం స్థానిక సర్పంచ్ గోపాల్‌రెడ్డి రూ.35 వేల విలువ చేసే సౌండ్ సిస్టమ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీరాములు, ప్రధానోపాధ్యాయుడు శ్రీకాంత్‌రెడ్డి, వార్డు సభ్యులు పవన్‌కుమార్, శ్రీలత, సంతోష, జలంధర్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, మహేందర్, సురేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జెండా తొలగించడం సరికాదు

సోషలిస్ట్ పార్టీ నేత పురుషోత్తం



వినతిపత్రం అందజేస్తున్న ఝాన్సీ

బడంగ్‌పేట్: సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా జెండాను అధికారులు తొలగించడాన్ని ఆపార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పురుషోత్తం తప్పుపట్టారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర నాయకురాలు ఝాన్సీ బాలాపూర్ డిప్యూటీ తహసిల్దార్ మహిపాల్‌రెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. పురుషోత్తం మాట్లాడుతూ గతంలో జిల్లా కలెక్టర్లకు, ఆర్డీఓకు, బాలాపూర్ తహసీల్దార్ విజ్ఞప్తి చేశామని, పార్టీ కార్యాలయాన్ని నిర్మించుకునేందుకు అనుమతులు ఇచ్చారని గుర్తుచేశారు. ప్రభుత్వం కేటాయించిన ప్రదేశంలోనే జెండా నెలకొల్పామని తెలిపారు. రెవెన్యూ అధికారులు గురువారం పార్టీ జెండాను, దిమ్మెను తొలగించారని పేర్కొన్నారు. సోషలిస్ట్ పార్టీ కార్యాలయ నిర్మాణానికి అధికారులు సహకరించాలని కోరారు.

ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయను

నియోజకవర్గ అభివృద్ధికి కృషి
- ఎమ్మెల్యే సబితారెడ్డి
- సర్పంచుల సేవలను కొనియాడిన మాజీమంత్రి



నాలా నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న సబితారెడ్డి

పహాడీషరీఫ్: నియోజకవర్గ ప్రజలు తనపై నమ్మకంతోనే మళ్లీ ఎమ్మెల్యే గెలిపించారని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా నియోజకవర్గాన్ని అని విధాల అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే సబితారెడ్డి స్పష్టం చేశారు. జల్‌పల్లి మున్సిపాలిటీ వార్డు నంబర్-3లోని నబీల్ కాలనీలో రూ.6.5 కోట్లతో నిర్మించనున్న ఎస్ఎన్‌డీపీ నాలా పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ నబీల్ కాలనీలో నిర్మిస్తున్న ఎస్ఎన్‌డీపీ నాలాతో 15 కాలనీలను ముంపు నుంచి కాపాడవచ్చని తెలిపారు. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, రెండు మూడు రోజుల్లో పనులు ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో శ్రీకారం

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎస్ఎన్‌డీపీ నాలాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. కొత్తపేటలోని కొంతమోని కుంట నుంచి గుర్రం చెరువు వరకు రూ.10 కోట్లతో నాలా నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. దీంతో పాటు చాంద్రాయణగుట్ట నుంచి డ్రైనేజీ నీరు నబీల్ కాలనీ మీదుగా ప్రవహిస్తుండడంతో స్థానిక ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. మాజీసీఎం కేసీఆర్ ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన రోజు ఇక్కడ శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందని అన్నారు. స్థానిక కౌన్సిలర్లు, బస్తీ అసోసియేషన్లు పరస్పరం సహకరించుకుంటూ పనులు త్వరగా పూర్తి చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జల్‌పల్లి మున్సిపాలిటీ చైర్మన్ అబ్దుల్లా సాది, వైస్ చైర్మన్ ఫర్హానా నాజ్, కమిషనర్ వసంత, కౌన్సిలర్ అహ్మద్ కసాది, ఎస్ఎన్‌డీపీ ఎస్ఈ భాస్కర్ రెడ్డి, ఈఈ కిష్టయ్య, డీఈ ప్రసాద్, జల్‌పల్లి డీఈ వెంకన్న, నాయకులు యూసుఫ్ పటేల్, శంషూద్దీన్, ఖలీఫా, ఉమర్ బామ్, అబ్దుల్లా లజ్జీ, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి ఫలాలు పల్లెలకు చేర్చిన యోధులు

కందుకూరు: గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ప్రగతి ఫలాలు పల్లెలకు చేర్చిన అభివృద్ధి యోధులు సర్పంచులని ఎమ్మెల్యే సబితారెడ్డి కొనియాడారు. ఈ మేరకు గురువారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. ఎన్ని తరాలు మారినా, యుగాలు గడిచినా చరిత్రలో ఈ ఐదేళ్ల పదవీ కాలం ముగించుకున్న సర్పంచులు గుర్తుండిపోతారన్నారు. నర్సరీలు, డంపింగ్ యార్డులు, పల్లె ప్రకృతివనాలు, ట్రాలీలు, ట్రాక్టర్లు, వైకుంఠ ధామాలు, క్రీడా ప్రాంగణాలు, రైతు వేదికల ఏర్పాటులో భాగస్వాములుగా నిలిచి స్వచ్ఛ గ్రామాల సృష్టికర్తలుగా మారారని పొగడ్తలు కురిపించారు. సకల సౌకర్యాలు కల్పిస్తూ గ్రామాల భవిష్యత్‌కు బాటలు వేశారన్నారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం దిశగా గ్రామాలను తీర్చిదిద్దారన్నారు. నేడు ఐదేళ్ల పదవీ కాలం దిగ్విజయంగా పూర్తి చేసుకుంటున్న సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు సబితారెడ్డి అభినందనలు తెలిపారు.

గ్రామాభివృద్ధికి కృషి చేశాం

సర్పంచ్ గొరిగె కలమ్మరాజు



ఆకులమైలారంలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సర్పంచ్, పీఏసీఎస్ చైర్మన్

కందుకూరు: గ్రామాభివృద్ధికి తమ వంతు కృషి చేశామని ఆకులమైలారం సర్పంచ్ కలమ్మరాజు తెలిపారు. గురువారం మండల పరిధిలోని ఆకుల మైలారంలో పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్‌తో కలిసి పంచాయతీ నిధులతో గ్రామంలో ఏర్పాటు చేసిన 16 సీసీ కెమెరాలను ఆమె ప్రారంభించారు. అనంతరం రోడ్డు విస్తరణలో ఇల్లు కోల్పోయిన బాధితులకు నష్టపరిహారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఐదేళ్ల పాటు గ్రామాభివృద్ధికి సహకరించిన సభ్యులకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వై.రాంరెడ్డి, వార్డు సభ్యులు మల్లయ్య, అమరేందర్‌రెడ్డి, మహేందర్, తులువ మహేందర్, సువర్ణ, బీరప్ప, తిరుమల వీరేశ్, జ్యోతి కృష్ణ, తిరుమలమ్మ, నాయకులు సురేందర్‌రెడ్డి, తిరుపతయ్య, అంజయ్య, అచ్చన పాండు, జంగయ్య, రావుల జంగయ్య, సురేందర్ పాల్గొన్నారు.

సీఐకి శుభాకాంక్షలు



సీఐ గురువారెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

పహాడీషరీఫ్: పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన గురువారెడ్డికి జల్‌పల్లి మున్సిపాలిటీకి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. గురువారం సీఐని కాంగ్రెస్ నాయకులు చింతకింది నవీన్ గౌడ్, సయ్యద్ నవాజ్, మహేశ్, మేరాజ్ పటేల్ మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందజేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పీట వేశారని, స్టేషన్ పరిధిలో కూడా నేరాల నియంత్రణ కోసం పోలీసులకు తమవంతు సహకారం అందిస్తామని నవీన్ గౌడ్ తెలిపారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి



ఇంద్రప్రస్థకాలనీలో రోడ్డు మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్, అధికారులు

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో జరుగుతున్న అభివృద్ధి పనులలో నాణ్యతాప్రమాణాలు పాటించాలని అందుకు ఇంజనీరింగ్ అధికారులు దగ్గరుండి పనులు చేయించాల్సిన అవసరం ఉందని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ అన్నారు. గురువారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని జిల్లా పరిషత్‌రోడ్డు నుండి ఇంద్రప్రస్థ కాలనీకి వెళ్లే రోడ్డుకు 10 లక్షల రూపాయలతో చేపడుతున్న మరమ్మతు పనులను ఇంజనీరింగ్ అధికారులతో కార్పొరేటర్ సుజాతనాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుజాతనాయక్ మాట్లాడుతూ రోడ్లు గుంతలు పడి ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారని కాలనీవాసులు తమ దృష్టికి తీసుకురావడంతో జీహెచ్ఎంసీ నుండి 10 లక్షల రూపాయలు మంజూరు చేయించి రోడ్డుకు మరమ్మతు పనులు చేపడుతున్నామని అన్నారు. ఏఈ హే మూనాయక్, కాలనీ అధ్యక్షుడు ప్రతాపరెడ్డి, రాజశేకర్‌రెడ్డి, మమత, మల్లేశ్‌గౌడ్, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, జానకీరామ్‌నాయక్ పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

దిల్‌సుఖ్‌నగర్: ఈ నెల 16న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక యూనియన్ రంగారెడ్డి జిల్లా కోశాధికారి జి.చైతన్య, సరూర్‌నగర్ సర్కిల్ సిఐటియు కన్వీనర్ మల్లెపాక వీరయ్య కార్మికులకు పిలుపునిచ్చారు. సరూర్ సర్కిల్ ప్రాంతంలో ఆర్‌కేపురం భవన నిర్మాణ కార్మిక సంఘం లేబర్ అడ్డా దగ్గర ఫిబ్రవరి 16వ తారీకు సమ్మెను గ్రామీణ బంధు దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేశారు. భవన నిర్మాణ కార్మిక యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ఆర్‌కేపురం లేబర్ అడ్డా అధ్యక్షతన వి వెంకటయ్య కార్మికులతో సంతకాలు సేకరణ కార్యక్రమం నిర్వహించారు.

కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి

వనస్థలిపురం: డివిజన్ పరిధిలోని సుభద్రానగర్ కాలనీలో సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. గురువారం కార్పొరేటర్ జీహెచ్ఎంసీ అధికారులతో కలసి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు కాలనీలో సీసీ రో డ్లు అధ్వాన్నంగా తయారయ్యాయని కార్పొరేటర్, అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కార్పొరేటర్ నూతన రోడ్లకు అంచనాలు రూపొందించి పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ చంద్రశేఖర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేష్, కాలనీ అధ్యక్షులు సత్యనారాయణ పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందికి సన్మానం

తలకొండపల్లి: గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకమని మాజీ ఎంపీపీ శ్రీనివాసుయాదవ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని వెల్జాల్‌లోని రైతువేదిక భవనంలో సర్పంచ్ సంగీతా శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎంపిపి శ్రీనివాసుయాదవ్‌తో పాటు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ముజీబుర్ రహ్మాన్ ఆధ్వర్యంలో పాలకవర్గాన్ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంగీత శ్రీనివాసుయాదవ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రవికుమార్, ఉప సర్పంచ్ అజీజ్, కార్యదర్శులు శరత్, జైశాలిని, జెడ్పీకోఆప్షన్ సభ్యుడు ముజీబర్ రహ్మాన్, హెచ్ఎంలు లీల, ప్రసాద్, మాజీ రైతు కమిటీ మండల కోఆర్డినేటర్ దశరథ్‌నాయక్, సర్పంచ్‌లు లింమ్మ, ఈశ్వర్ నాయక్, హైమావతి, రమేష్, విజయారెడ్డి, నరేందర్‌గౌడ్, కారోబార్ రవి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అండగా నిలవాలి



విద్యార్థులను విజ్ఞాన యాత్రకు తీసుకెళ్తున్న నారగోని శ్రీనివాస్‌యాదవ్

హస్తినాపురం: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అండగా నిలవాలని, వారిని అన్ని విధాలుగా ప్రోత్సహిస్తే వారు చదువుతోపాటు అన్ని రంగాలలో రాణిస్తారని భూపేశ్‌గుప్తానగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నారగోని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. గురువారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని భూపేశ్‌గుప్తానగర్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులను విజ్ఞానయాత్రకు తీసుకెళ్లేందుకు ఉచితంగా బస్సును ఏర్పాటు చేసి వారిని తీసుకెళ్లేందుకు శ్రీనివాస్ యాదవ్ ఉపాధ్యాయులతో కలిసి జెండా ఊపి పంపించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులను విజ్ఞాన యాత్రకు తీసుకెళ్తున్నామని అన్నారు. నగరంలోని జూపార్కు, గోల్కొండ, సాలార్‌జంగ్‌మ్యూజియం తదితర ప్రాంతాలకు తీసుకెళ్లి వారికి వాటి చరిత్ర గురించి వివరించేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జి.డేవిడ్, ఎస్.వి జయ్‌కుమార్, ఎం.వేణుగోపాల్, టి.నాగమణి, పి.సునిత, బి.సంఘమిత్ర, ఎస్.రాజ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

చెకుముఖి పోటీలతో ప్రతిభకు గుర్తింపు



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎంఈఓ సర్దార్‌నాయక్

ఏంఈఓ సర్దార్‌నాయక్

కడ్తాల్: విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను గుర్తించేందుకే చెకుముఖి పోటీలు నిర్వహిస్తున్నట్లు ఏంఈఓ సర్దార్‌నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెక్‌ముఖి టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. పోటీల్లో మండల పరిధిలోని 9 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో వారికి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. తెలుగు మాధ్యమంలో కడ్తాల్ బాలుర ఉన్నత పాఠశాల ప్రథమ స్థానంలో నిలవగా, ద్వితీయ స్థానంలో ఎక్వాయిపల్లి పాఠశాల నిలిచింది. ఆంగ్లమాధ్యమంలో ముద్వీన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రథమ స్థానంలో నిలవగా, ద్వితీయ స్థానంలో రావిచేడ్ ఉన్నత పాఠశాల నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ సర్దార్‌నాయక్ మాట్లాడుతూ.. టాలెంట్ టెస్ట్ ద్వారా విద్యార్థుల్లో మూఢనమ్మకాల నిర్మూలనపై అవగాహన కలుగుతుందని, తార్కిక ఆలోచన మెరుగుపడుతుందని తెలిపారు. పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన పాఠశాలల విద్యార్థులు జిల్లా పోటీలకు ఎంపికయ్యారని.. ఆదివారం తుర్కయాంజాల్‌లో నిర్వహించే జిల్లాస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారని పేర్కొన్నారు. నోడల్ అధికారి జంగయ్య పోటీల్లో విజేతలైన విద్యార్థులను అభినందించి ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు అరుణ, రామనాథం, జంగయ్య, ఉపాధ్యాయులు.. శ్రీనివాసరావు, జైపాల్, సుభ్‌జీవన్‌రెడ్డి, రాధాకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

తరచూ ట్రాఫిక్ జామ్.. నిత్యం పరేషాన్

వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్‌లలో రద్దీ ఇబ్బందుల్లో వాహనచోదకులు



వనస్థలిపురం రైతు బజారు కూడలిలో..

వనస్థలిపురం: వాణిజ్య పరంగా దినదినాభివృద్ధి చెందుతున్న వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్‌లలో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్యలు తీవ్రమవుతున్నాయి. వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్‌ల ప్రధాన రహదారులలో పేరొందిన కంపెనీలకు చెందిన షోరూంలు, కార్పొరేట్ కళాశాలలు, స్కూళ్లు, బ్యాంకులు, హోటళ్లు, పలు వాణిజ్య సముదాయాలు ఏర్పడడంతో రద్దీ ప్రాంతాలుగా మారాయి. అయితే వాణిజ్య సముదాయాలు, బ్యాంకులకు సరైన పార్కింగ్ వసతి లేకపోవడంతో వాటి వినియోగదారులు తమ వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలతో ఆ దారిన వెళ్ళే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ నియంత్రణకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

- వనస్థలిపురం ప్రధాన రహదారిలో ఉన్న పోలీసు స్టేషన్ ముందు స్టేషన్‌కు వచ్చేవారు, సిబ్బంది తమ వాహనాలను రోడ్డుపైనే రెండు వరుసల్లో పార్కింగ్ చేస్తుండడంతో రోడ్డు ఇరుకుగా మారి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి.
- పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా ఉన్న ఎస్‌బీఐ వద్ద ఇదే పరిస్థితి. బ్యాంకుకు వచ్చే ఖాతాదారులు బ్యాంకుకు సరైన పార్కింగ్ వ్యవస్థ లేకపోవడంతో తమ వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్‌జాంలు తప్పడం లేదు.
- వనస్థలిపురం ప్రధాన రహదారిలో ఉన్న పాఠశాలల వద్ద కూడా తరచు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. విద్యార్థులను తీసుకుపోవడానికి వచ్చే ద్విచక్ర వాహనాలు, ఆటోలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తుండడంతో బస్సులు, ఇతర వాహనాలు వెళ్లడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి.
- వనస్థలిపురం రెడ్ వాటర్ ట్యాంక్ వద్ద మూడు వైపులనుంచి వచ్చే వాహనాలు జిగ్‌జాగ్‌గా వెళుతుండడంతో తరచుగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇక్కడ ట్రాఫిక్ నియంత్రణ లేకపోవడంతో వాహనదారులు ఇష్టారీతిన వెళుతున్నారు.
- వనస్థలిపురం రైతుబజారు వద్ద నాలుగు రోడ్ల కూడలిలో ఇదే పరిస్థితి. నాలుగు వైపుల నుంచి వాహనాలు జిగ్‌జాగ్‌గా వెళుతుండడంతో ట్రాఫిక్ సమస్య, ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడ ట్రాఫిక్ నియంత్రణకు సిబ్బందిని పెట్టాల్సిన అవసరం ఉంది.
- వనస్థలిపురం గణేష్ టెంపుల్ నుంచి బీఎన్‌రెడ్డినగర్ చౌరస్తా వరకు రాత్రి వేళ నిత్యం ట్రాఫిక్ జాంలు ఏర్పడుతున్నాయి. ఆయా వ్యాపార సంస్థల ముందు వాహనదారులు తమ వాహనాలను అడ్డగోలుగా పార్కింగ్ చేస్తుండడంతో రోడ్డు కుంచించుకుపోయి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి.
- బీఎన్‌రెడ్డినగర్ చైతన్యనగర్‌లో బీడీరెడ్డి గార్డెన్ సమీపంలోని తెలంగాణ చౌరస్తాలో తరచు ట్రాఫిక్‌జాంలు ఏర్పడుతు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ట్రాఫిక్ నియంత్రణకు సిబ్బంది లేకపోవడంతో వాహనదారులే వాహనాలను క్రమబద్ధీకరించుకోవాల్సిన పరిస్థితి.

“ స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నాం

వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్‌లలో రోడ్లపై పార్కింగ్‌లతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్న విషయం నిజమే. పార్కింగ్ సదుపాయం లేని వాణిజ్య భవనాలకు టౌన్ ప్లానింగ్ అధికారులు యథేచ్ఛగా అనుమతులు ఇస్తున్నారు. ఇక్కడ ట్రాఫిక్ నియంత్రణకు సరిపోనూ సిబ్బంది లేరు. వనస్థలిపురం రైతుబజారు, బీడీరెడ్డిగార్డెన్ సమీపంలోని తెలంగాణ చౌరస్తాలలో రద్దీవేళల్లో ట్రాఫిక్ నియంత్రణకు కానిస్టేబుళ్లను పెడుతున్నాం. తరచుగా బీఎన్‌రెడ్డినగర్ నుంచి వనస్థలిపురం వరకు స్పెషల్‌డ్రైవ్ చేపడుతున్నాం. రోడ్లపై పార్కింగ్ చేసినవారికి చాలాన్లు రాస్తున్నాం. రోడ్డు ఆక్రమణలను తొలగిస్తున్నాం.

– బాలూ చౌహాన్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, వనస్థలిపురం



వనస్థలిపురం రెడ్ వాటర్‌ట్యాంక్ కూడలిలో..



వనస్థలిపురం గణేశ్ టెంపుల్ వద్ద రాత్రివేళ..



వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ వద్ద..

అక్రమంగా మట్టిని తరలిస్తున్న వ్యక్తులు అరెస్టు



పోలీసుల అదుపులో నిందితులు

వాహనాలు సీజ్ చేసిన పోలీసులు

మహేశ్వరం: ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో అక్రమంగా మట్టిని తరలిస్తున్న 20 మందిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం మండల పరిధిలోని ఉప్పుగడ్డ తండా సమీపంలోని ప్రభుత్వభూముల్లోఅనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్న పోతుల ప్రసాద్, మండల సందీప్, జయనాయక్, మునావత్ సంతోష్ నాయక్, సంజీవ, వాకాడ మణికంఠ, కలకొండ వాసుదేవ్ జటావత్ కిషన్, చింతకింది ప్రభాకర్, కృష్ణ కుమార్ యాదవ్, మాల అంజి, ప్రదీప్ దాస్, మహ్మద్ ఖదీర్, వినయ్ కుమార్ సింగ్, సురేందర్ సింగ్, రవీందర్ దాస్ బత్తుల మహేశ్, గోవింద్, ప్రదీప్, రాకేశ్, పాండులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. 3 ఇటాచీలు, ఒక లారీ ట్రాలీ, 7 టిప్పర్లు, 17 సెల్ ఫోన్లు, ఒక బైక్, కారును సీజ్ చేశారు. ప్రభుత్వ, అసైన్డ్, శిఖం భూముల్లో అనుమతి లేకుండా మట్టిని తవ్వినా.. వాహనాలలో తరలించినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.